


# అనుకున్నదొకటీ...



‘ఇల్లు, సంసారం అన్న తరువాత ఏవో చిన్న చిన్న అభిప్రాయ భేదాలు రావడం, ఆపైన మాట మాట అనుకోవడం సహజం. పెద్దవాళ్లు తప్పు ఒప్పులు చూసి సరిదిద్దాలి. అంతేకాని ప్రతి మాటకు పెడర్థాలు తీసి ఇల్లు వదలి వెళ్ళిపోవడం ఏం బాగుంది చెప్పండి?”

“వాళ్ళను నేను ఏమీ అనలేదు. ఏనాడూ ఏ విషయంలోనూ ఎదిరించి మాట్లాడలేదు. కించపరిచి అవమానించ లేదు”

“మాటల సందర్భంలో మీ అమ్మగారితో మీరు మీ పెద్దకొడుకు వద్దకు వెళ్లి కొద్దిరోజులు ఉండకూడదా? మీకూ కొంత మార్పు ఉంటుంది. మీకు ఉన్నది ఇద్దరు కొడుకులే కదా? వాళ్లూ మీ రాకకు ఎంతో ఆనందిస్తారు కదా అన్నాను.

నా మాటలు మీ నాన్నగారు విన్నారు. ఆ మట్టున ఆయన, మీ అమ్మగారు పెరట్లో జామచెట్టు క్రిందకు వెళ్లి ఏవో గుసగుసలాడుకొని వచ్చి బట్టలు సర్దుకున్నారు. మీరు ఇంటికి రాగానే, అబ్బాయ్ మేము ఊరెళ్తున్నాం అని చెప్పి వెళ్లిపోయారు!

“చుట్టాలు, బంధువులు, స్నేహితులు, ఇరుగు పొరుగు వారు అంతా మనల్ని తప్పుపట్టి నిందిస్తున్నారు. మనం ఏదో చేసి వారిని ఇంట్లోంచి తరిమివేశామంటున్నారు. ఏది ఏమైనా అన్నివిధాలా నష్టపోయింది మనమే కదండీ!”

“నిజమే శాంతా! నెల తిరిగేసరికి నాన్నగారు తన పెన్షన్‌లో మూడొంతుల సొమ్ము నా చేతికిచ్చి, గోపీ ఇవి ఇంటి ఖర్చులకు వాడరా అనేవారు. నేనెంత వారించినా వినేవారు కాదు. ప్రతినెలా కరెంట్ బిల్లూ, టెలిఫోన్ బిల్లూ, కేబిల్ టీవీ బిల్లూ, ఇంటిపన్నూ, నీటిపన్నూ అన్నీ ఆయన దగ్గరున్న డబ్బుతోనే కట్టేవారు. ఎలా చూసినా ఎనిమిది వేలు మించే ఉంటుంది. నా జీతంలోంచి ఇంటి ఖర్చులకు వాడక్కరలేకపోయేది!”

“అంతేకాదండీ! రోజూ ఉదయాన్నే రైతు బజారుకు వెళ్లి తాజా కాయగూరలు, ఆకుకూరలు, పళ్లూ తెచ్చేవారు! వారు వెళ్లిపోయాక తాజా కాయగూరలు కరువయ్యాయి. ఉదయాన్నే వెళితే మనకు తాజా సరుకు దొరుకుతుంది. మనకు ఉదయం పూట తీరదు. సాయంత్రం వెళితే వాడిపోయినవి, ముదురువి, పుచ్చిపోయినవి దొరుకుతున్నాయి”

“అత్తయ్యగారు రోజూ రెండుపూటలా వంట పనంతా ఆవిడే చేసేవారు. ప్రతీది పిల్లలకని వేరే చేసేవారు. వాళ్లు పేచీలు పెట్టకుండా తినేవారు. ఆవిడ మాట వినేవారు. ఇప్పుడు నేను ఎలా చేసి పెట్టినా వారికి నచ్చటం లేదు. ప్రతీదానికి వంకలుపెట్టి పేచీలు!

రాత్రిళ్ళు మావయ్యగారు పిల్లల్ని కూర్చోపెట్టుకొని వాళ్లచేత హోంవర్కు చేయించి చదివించేవారు. తెలియనివన్నీ ఓపిగ్గా వారికి అర్థమయ్యేలా చెప్పేవారు. అందరికీ ఫస్ట్ మార్కులొచ్చేవి. ఇప్పుడు ట్యూషను పెట్టినా వారు సరిగా చదవటం లేదు.

ooo

“ఏవండీ! మీకు ఈ విషయం తెలుసా? మీ అమ్మగారూ, నాన్నగారు విశాఖపట్నంలో వృద్ధాశ్రమంలో ఉన్నారుటండీ!”

“నాకూ ఇప్పుడే తెలిసింది శాంతా! రామనాథం మామయ్య చెప్పారు. చెప్పడం కాదు తల వాచేటట్లు చీవాట్లు పెట్టారు. ప్రయోజకులైన ఇద్దరు కొడుకులున్నారు. ఆ మాత్రం తల్లిదండ్రులను పోషించలేరా? వారికి కాస్త సేవ చెయ్యలేరా? వారిని వృద్ధాశ్రమానికి సాగనంపారు. వారి పోషణకు మీ సొమ్మేమీ ఖర్చు చెయ్యాలా? వాళ్ల సొమ్మే ఇన్నాళ్లూ మీకు ఖర్చు చేశారు. అంతేకాదు ఇంటి చాకిరీ అంతా చేసేవాళ్లు!

మీ దగ్గర ఉన్నప్పటికంటే అక్కడ ఆశ్రమంలో వాళ్లిద్దరూ ఏ చీకూ చింతా లేకుండా, ప్రశాంతంగా, ఆరోగ్యంగాను, ఉల్లాసంగాను ఉన్నారు. ప్రతిరోజూ ఉదయం డాక్టరు వచ్చి అందర్నీ పరీక్ష చేస్తున్నాడు. వాళ్ల గురించి ఇక మీకు ఏ దిగులూ అవసరం లేదు నిర్భయంగా ఉండండి అని నిందించారు”

వాళ్లు ఆశ్రమానికి వెళ్లాలని నిశ్చయించుకుంటే ఆ సంగతి మనకు చెప్పొచ్చు కదా! వాళ్లను ఎవరూ అడ్డగించరు కదా! మనకి యీ ఆరాటం, నిందలు, అవమానాలు ఉండేవి కాదు కదా?”

“అది సరేనండీ! మీ వాళ్లకు మరి అక్కడ ఏ ఖర్చూ లేదు కదండీ! నెల నెలా మీ నాన్నగారి పెన్షన్ పదివేలూ మిగులే కదా! మూడు నెలలై వారు ఆ సొమ్ము ఏం చేస్తున్నట్లు? మన పిల్లల పేర దానిని బ్యాంకులో వేయమనండి. ప్రతి నెలా డ్రా చేసి మన చేతికిస్తే మనమే పిల్లల పేర బ్యాంకులో వేద్దాం. మీ అమ్మగారికి ఆవిడ పుట్టింటి వారు వందకాసుల బంగారు నగలు పెట్టారుట. ఆవిడ వాటిని వాడకుండా బ్యాంకు లాకర్‌లో ఉంచారు కదా! వాటిని నాకు ఇమ్మని చెప్పండి”

“మనం తక్షణం బయల్దేరి విశాఖపట్నం వెళ్దాం. వాళ్లు అక్కడ ఉన్నారని తెలిసి వెళ్లకపోతే బాగుండదు”

ooo

“రా గోపీ! కోడలూ, పిల్లలూ అంతా వచ్చారే! సంతోషం. నేనే నీకు ఫోన్ చేద్దామనుకుంటున్నాను. మరేం లేదు. ఊరి పొలిమేరనున్న ఈ ప్రదేశం పది గ్రామాల కూడలి! ఆ గ్రామవాసులకు ఉచితంగా వైద్య సదుపాయం అందించడానికి ఇక్కడ ఒక ఆసుపత్రి కట్టించి అందులో అన్ని పరకరాలు సమకూర్చాలనుకున్నాం. పని ప్రారంభించాం.

విదేశాల్లో ఉన్న ఇక్కడివారి పిల్లలంతా మా ప్రొపోజల్ విని హర్షించి విరివిరిగా విరాళాలు పంపారు. మీ అమ్మ తన వంతు విరాళంగా తన కన్నవారు పెట్టిన వందకాసుల బంగారు నగలు అమ్మి ఆ సొమ్ము ఇచ్చింది. నేను ప్రతి నెలా నా పెన్షన్ డ్రా చేసి ఇస్తానన్నాను

ఈ విషయం మీ అన్నయ్యకు చెప్తే తన వంతు విరాళం పదివేలు పంపించాడు. నీవంతు విరాళం ఎంత ఇస్తావో చెప్పు!”

“ఇదేవిటండీ! మనం ఎంతో ఆశపడి వస్తే ‘చిల్లి కదిపిన చింతపండులా’ అయింది వ్యవహారం!” అంది కోడలు నిట్టూరుస్తూ.

-రావి-ఎన్-అవధాని★